క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు/మైదుకూరు : ఈ నెల 30 తేదీ లోపల వైఎస్సార్ రైతు భరోసా పథకం కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయా మండలాల వ్యవసాయ అధికారులు మ్యాగీ, పి.లక్ష్మీప్రసన్నలు తెలిపారు. మండలాల్లోని గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. గతేడాది రైతు భరోసా పథకం వర్తించని రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు.

పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన డీపీఓ



వర్మీకంపోస్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న డీపీఓ ప్రభాకర్ రెడ్డి

ప్రొద్దుటూరు : జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి గురువారం సాయంత్రం కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లపై వివరాలు సేకరించారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, డీఎల్‌పీఓ భాస్కర్, ఈఓపీఆర్డీ పరమేశ్వరరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వై.గురుమోహన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని సురక్ష బ్లడ్ బ్యాంక్‌లో గురువారం ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు బ్యాంక్ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పవన్, సుధాకర్, చైతన్య, ధారా సంతోష్, పుల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, పలు బ్యాంక్‌లకు సంబంధించిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

లెక్కలవారిపల్లెలో క్షేత్ర దినోత్సవం

మైదుకూరు : మండలంలోని లెక్కలవారిపల్లెలో గురువారం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం వారు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త ఎం.హర్షిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేరుశనగ పంట దిగుబడిని పరిశీలించారు. కొత్తరకం విత్తనాలు కె.1812, టీసీ 1157ల సాగులో రైతుల అనుభవాలను, నిర్వహణ, పెట్టుబడుల గురించి కేవీకే అధిపతి, శాస్త్రవేత్త ఎస్.శ్రీవిద్యారాణి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బీఎస్ కాంతిశ్రీ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు, కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి రంజాన్ పండుగ సందర్భంగా దివ్యాంగులకు గురువారం సాయంత్రం రంజాన్ తోఫా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనిరెడ్డి ఫౌండేషన్ స్థాపించినప్పటి నుంచి పేదల కోసం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే రంజాన్ సందర్భంగా పేదలైన ముస్లిం దివ్యాంగులకు నిత్యావసర వస్తువులతో కూడిన కిట్ రంజాన్ తోఫాను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కొనిరెడ్డి రమణారెడ్డి, యువ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : వేసవి కాలంలో పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు డాక్టర్ పవన్, డాక్టర్ నరసింహారెడ్డిలు తెలిపారు. మండల పరిధిలోని చింతలచెరువు వాటర్‌షెడ్ పరిధిలోని ఉప్పత్తివారిపల్లె గ్రామంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ సహకారంతో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో వారు మాట్లాడుతూ పశుసంపద బాగుంటే పాడిపరిశ్రమ బాగుంటుందన్నారు. ఈ శిబిరంలో 31 పశువులకు గర్భకోశ చికిత్సలు, 19 పశువులకు సాధారణ చికిత్సలు, 23 దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్ చెంచుకళ, ప్రాజెక్టు ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



రాచాయపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. గురువారం మండలంలోని రాచాయపేట సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఆ కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్‌సీపీ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామస్థులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా అక్కడికక్కడే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. అనంతరం రాచాయపేట సచివాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. వివిధ సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఎక్కడా కూడా ప్రజల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులు రాకూడదని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, సర్పంచ్ నాగేంద్ర, మాజీ ఎంపీటీసీలు సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు రవిచంద్రారెడ్డి, శివారెడ్డి, హరికృష్ణారెడ్డి, ఎస్.సుబ్బరాయుడు, అబ్బిరెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలి



సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి

చాపాడు : ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరాన్ని గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలని ఎఫ్‌పీసీ నోడల్ అధికారి డాక్టర్ నాగేంద్ర కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి స్థానిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. బీపీ, సుగర్ ఉండే వారికి ప్రతి నెలా మందులు అందుతున్నాయా అనే అంశంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసమే ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను ప్రవేశపెట్టారన్నారు. 104 వాహనం వద్దకు వెళ్లలేని రోగులను గుర్తించి వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ఓబులేసు, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగులపల్లెలో..

మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నాగులపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో ప్రజలందరికీ వైద్యురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలందరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారి చెప్పారు.

పక్కాగృహాలను తక్షణమే పూర్తి చేయాలి

బద్వేలు : ప్రభుత్వం కేటాయించిన పక్కాగృహాలను తక్షణమే లబ్ధిదారులు పూర్తి చేయాలని పోరుమామిళ్ల ప్రత్యేక అధికారి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తహసీల్దార్ విజయకుమారితో కలిసి గురువారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్మాణాలు మధ్యలో నిలిపిన లబ్ధిదారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి డ్వాక్రా సంఘాల నుంచి అదనంగా రుణాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం బిల్లులు అందిస్తోందని త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వారిని నిరంతరం కలిసి నిర్మాణాలు నిలుపుదల చేసుకోకుండా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేష్‌బాబు, ఏపీఎం అశోక్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెద్దిరాజు

బద్వేలు : గ్రామాల్లో తాగునీటి ఎద్దడికి అధికారులు చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెద్దిరాజు తెలిపారు. గురువారం పోరుమామిళ్ల మండలంలోని స్త్రీ శక్తి భవన్‌లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆయన పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవి తీవ్రత కారణంగా తాగునీటి ఇక్కట్లు ఏర్పడే అవకాశముందని, పంచాయతీ కార్యదర్శులు ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీటితో పశువులు, పక్షులకు తాగునీటికి సంబంధించి ఉన్న తొట్లను శుభ్రం చేసి నీటితో నింపాలన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. పక్కాగృహాల లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ నూర్జహన్, ఎమ్మార్వో విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : పోషకాహారం తీసుకోవడం వల్ల గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు ఆరోగ్య వంతులుగా ఉంటారని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. స్థానిక బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, మహిళా పోలీసులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. సరైన సమయంలో పోషకాహారం ఇవ్వాలన్నారు. మాతా, శిశుమరణాలు లేని సమాజం కోసం అందరూ పాటుపడాలని చెప్పారు. రూరల్ సీడీపీఓ అరుణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ప్రాంతాల్లోని గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలను గుర్తించి పోషకాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, హెచ్ఈ శోభారాణి, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, షంషాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



పట్టుబడిన పేకాటరాయుళ్లతో సీఐ నారాయణ యాదవ్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు శివారులోని బొల్లవరం ప్లాట్లలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై త్రీ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన మేరకు బొల్లవరం ప్లాట్లలో పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో గురువారం సాయత్రం త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో కృష్ణయ్య, రాజేష్, కుళ్లాయప్ప, బాషా, ప్రవీణ్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 1,70,620 నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ద్వారకానగర్, ఈశ్వరరెడ్డినగర్, అమృతానగర్, ఆచార్లకాలనీ, దొరసానిపల్లె ప్రాంతాలకు చెందిన వారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణయాదవ్ తెలిపారు.

రీ సర్వే వేగవంతం చేయండి



భూ సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్

బ్రహ్మంగారిమఠం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్, జగనన్న సంపూర్ణ భూ రక్ష హక్కు పథకం కింద చేస్తున్న భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం బద్వేలు ఆర్డీఓ ఆవుల వెంకటరమణతో కలసి ఆయన మండలంలోని రేకులకుంట పంచాయతీ డి.అగ్రహారం గ్రామంలో భూ రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూ సర్వేలో వెనుకంజలో బి.మఠం ఉందని తెలిపారు. పూర్తిగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి భూ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ వెంకటలక్ష్మి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

సహజ పానీయాలతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : సహజ పానీయాలతో ఆరోగ్యం చేకూరుతుందని జనవిజ్ఞాన వేదిక పట్టణ గౌరవాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం నందినీ క్లాత్ మార్కెట్‌లో జేవీవీ కార్యాలయం వద్ద ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో దాహం తీర్చుకోవడానికి రసాయనాలతో తయారైన కూల్ డ్రింక్స్ తాగడం ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. మజ్జిగ, రాగిజావ, కొబ్బరి నీరు, షర్బత్ వంటి సహజ పానీయాలను తాగాలని సూచించారు. జేవీవీ నాయకులు రాజేష్, శ్రీరాములు, మురళి, మధుసూదన్‌రెడ్డి, అశ్రిత్, అక్షిత, శర్వణి, మీనా, శివానంద్, వలి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉజ్జీవ స్వస్థత మహాసభలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు పరిశుద్ధాత్మ ఉజ్జీవ స్వస్థత మహాసభలను నిర్వహించనున్నట్లు పరిశుద్ధాత్మ ప్రార్థన మందిర సంఘ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసంగీకులు పాస్టర్ పీజే భరత్‌కుమార్, సిస్టర్ పి.సునీత భరత్ ప్రసంగిస్తారని, క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొనాలని కోరారు.

సంక్షేమ పథకాలతో మరింత అభివృద్ధి

బి.కోడూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు సంక్షేమ పథకాల ద్వారా మరింత అభివృద్ధి చెందారని సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మున్నెల్లి పంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గృహసారధులతో కలిసి గడప గడపకు వెళ్ళి జగన్ ప్రభుత్వంలో అందుతున్న పథకాల గురించి, ఏవైనా లోపాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, సుబ్బరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభలవీడులో పశువైద్య శిబిరం

బి.కోడూరు : జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ప్రభలవీడు వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని ప్రభలవీడు గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 25 దూడలు, పశువులకు, 560 గొర్రెలకు వైద్యం అందించారు. ఈ శిబిరంలో ప్రభలవీడు వాటర్‌షెడ్ చైర్మన్ సాయిరెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డి పాల్గొని రైతులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. వాటర్‌షెడ్ టెక్నికల్ ఆఫీసర్ వెంకటరమణ, ఏహెచ్ఏలు నాగేంద్ర, వంశీ, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

బద్వేలు అర్బన్ : ప్రకృతి వ్యవసాయం చేయడం వలన నేలకు, వాతావరణానికి, మానవాళి మనుగడకు అన్నిరకాలుగా ఆరోగ్యకరమని పుట్టాయపల్లె సర్పంచ్ వంకెల జయరామిరెడ్డి తెలిపారు. గురువారం పుట్టాయపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. వీఏఏ రమణారెడ్డి, మాస్టర్ ట్రైనర్ జంగయ్య, యూనిట్ ఇన్‌చార్జి విజయశేఖర్, సీఆర్‌పీ చంద్రకళ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

బ్రహ్మంగారిమఠం : జగనన్న గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని నియోజకవర్గం ప్రత్యేక అధికారి నరసింహ తెలిపారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కొన్ని గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు కేటాయించిన గృహాలను తప్పనిసరిగా వారు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. దీనికి గ్రామ సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించి ఇళ్లు నిర్మించుకునేలా చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, హౌసింగ్ ఏఈ నాగజ్యోతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరంలోని ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన అమీన్‌పీర్ దర్గాలో గురువారం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా యదుల్లా మాలిక్ మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ ఉరుసు ఉత్సవం వైభవంగా జరిగింది. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చి గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అల్లాహ్ చూపిన మార్గంలో నడవాలి



దువ్వూరు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : అల్లాహ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో గురువారం మండలంలోని ముస్లింలందరికి ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లాహ్ ప్రబోధించిన ప్రకారం ఇతరుల పట్ల ప్రేమ, కరుణ, సోదరభావాన్ని కలిగి ఉండాలని తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ వారి శక్తి మేర దానం చేయడం వలన దేవుడి కృపకు పాత్రులవుతారని చెప్పారు. ఎమ్మెల్యే ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి మహబూబ్‌బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు అమీర్, నాయబ్, గౌస్, బందేఖాన్, మత గురువు సాబ్జీ పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంతోనే గుర్తింపు



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే తమను గుర్తించి రెగ్యులర్ చేసిందని పలువురు క్షురకులు తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని ఆయన స్వగృహంలో గురువారం ఏపీ నాయీబ్రాహ్మణుల సేవా సంఘం నాయకులు, కలిశారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం పట్టణాధ్యక్షుడు కొత్తపల్లె కిశోర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో క్షురకులుగా పనిచేస్తున్న తమను ఎవరూ గుర్తించలేదన్నారు.సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పలు ప్రముఖ దేవస్థానాల్లో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న క్షురకులకు ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేశారన్నారు. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల పాలకవర్గంలో నాయీబ్రాహ్మణులకు డైరెక్టర్లుగా నియమించాలని జీఓ విడుదల చేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు బలపనూరు శ్రీనివాసులు, రిటైర్డు తహసీల్దార్ శేషాద్రి, లక్షుమన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది రియల్ హీరోలు



రక్తదానం చేస్తున్న సబ్‌జైలు సూపరింటెండెంట్ సురేష్

ప్రొద్దుటూరు క్రైం : ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలను కాపాడుతున్న అగ్నిమాపక సిబ్బంది నిజమైన హీరోలని సబ్‌జైలు సూపరింటెండెంట్ సురేష్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మంటలను లెక్క చేయకుండా ఎంతో ధైర్యసాహసాలతో విధులు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ మాట్లాడుతూ ఎండా కాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వారం రోజుల పాటు అన్ని వర్గాల వారికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించామని చెప్పారు. అనంతరం సబ్‌జైలు సూపరింటెండెంట్ సురేష్, అగ్నిమాపక అధికారి రఘునాథ్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది రక్తదానం చేశారు.

దేశ సమగ్రాభివృద్ధిలో బీజేపీ విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

మైదుకూరు : ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాల్చి ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ, ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి, దేశ సమైక్యత, సమగ్రతకు బీజేపీ తూట్లు పొడుస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా నాయకుడు శివకుమార్ ఆరోపించారు. గురువారం సాయంత్రం మైదుకూరులో ప్రదర్శన అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ నల్లధనం వెలికితీత, రైతు ఆదాయం రెట్టింపు, పేదిరక నిర్మూలన, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పన, ధరల స్థిరీకరణ, దేశ సమైక్యత, సమగ్రాభివృద్ధి సాధించడంలో బీజేపీ ఘోరంగా విఫలమైందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై బీజేపీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.శ్రీరాములు, సీపీఎం నాయకులు షరీఫ్, సీపీఐ నాయకులు శివరాం, ఏఐఎస్ఎఫ్ వలరాజు, పవన్, ఎస్ఎఫ్ఐ రాజేంద్ర, భాస్కర్, బీవీ శ్రీనివాసులు, షావలి, చేతన్, హరి ప్రశాంత్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



రిజిస్టర్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయనగర్ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డితో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు పుత్తాశ్రీరాములు, సింగసానిశివయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ దీప్తి

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు, జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను త్వరగా నిర్మించాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి తెలిపారు. ప్రొద్దుటూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 6,031 ఇళ్లను నిర్మించాల్సి ఉందన్నారు. వీటిలో వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. చివరి దశలో ఉన్న 389 ఇళ్లను త్వరగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, ఐకేపీ ఏపీఎం వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

ఆరాధన గురుపూజోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ఈనెల 27 నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధికారులను కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచే గాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఈ ఆరాధన గురుపూజ మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండి ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానాలను ఏర్పాటు చేసేందుకు అన్నసత్రాలు ఉన్నాయని, వాటికి అధికారులు సహకరించాలన్నారు. అనంతరం దేవాదాయశాఖ ఏసీ, బి.మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ మాట్లాడుతూ బ్రహ్మంగారి ఆరాధన గురు పూజ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎస్ఐ విద్యాసాగర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, స్థానిక సర్పంచ్ రామయ్య, ఎంపీటీసీలు మనోహర ఆచారి, అంకిరెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.